www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి | భద్రాద్రి
శుక్రవారం | 18 | సెప్టెంబర్ | 2026
పేజీలు : 8

## కౌన్సిలర్ల వ్యతిరేకతతో వాయిదా పడ్డ మున్సిపల్ సమావేశం




-కౌన్సిలర్ల అభిప్రాయాలు తీసుకోకుండానే ఎజెండా..?

-వరుస సమావేశాల్లోనూ ఇదే తంతు..

పాలకవర్గంలో అసంతృప్తి

ప్రజాపక్షం/వైరా : వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ ఏకపక్ష నిర్ణయాల కారణంగా కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో శనివారం జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేశారు. అయితే జరగనున్న కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన మినిట్స్ బుక్‌ను పాలకవర్గ కౌన్సిలర్లకు పంపిన నేపధ్యంలో, అందులోని కొన్ని ప్రతిపాదనలు, తీర్మానాలపై కౌన్సిలర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు మిగతా 2లో..

# ఆమెకు సహకరించింది ఎవరు..?







-నకిలీ పింఛన్‌దారుల సంగతేంటి

-వదిలేస్తారా... చర్యలు తీసుకుంటారా

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రంగా నకిలీ సదరం సర్టిఫికెట్ల ధృవీకరణ వ్యవహారంలో ఓ ప్రైవేటు వ్యక్తికి సహకరించింది ఎవరన్న దానిపై ఇప్పుడు చర్చ సాగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రితో ఎటువంటి సంబంధం లేని ఓ ఫిజియోథెరపిస్టు సదరం క్యాంపుల్లో కూర్చుని వందలాది మంది అనర్హులకు వికలాంగ ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో కీలక భూమిక పోషించడం ఇందుకు సంబంధించి పెద్ద మొత్తంలో వసూళ్లు చేయడం వెనుక ఎవరు ఉన్నారనే దానిపై చర్చ సాగుతుంది. సదరంలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యుల సహకారం లేకుండానే సదరం ధృవీకరణ పత్రాలు జారీ అయ్యాయా అన్నది ఇప్పుడు ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. కనీస వైకల్యం లేని వారికి కూడా 40 నుంచి 50 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధృవీకరణ పత్రాలు జారీ చేయడంతో ఇప్పుడు ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నకిలీ పింఛన్ మిగతా 2లో..

## కమ్యూనిస్టుల త్యాగ ఫలితమే విలీనం

-శరణు కోరిన వారు మాట్లాడేందుకు అర్హులా

-తెలంగాణ పోరాట వారోత్సవ ముగింపు సభలో బాగం

2లో



## సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ఊరుకోం



- అధికారికంగా విలీన దినోత్సవాన్ని జరిపించాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

2లో

## సాగుకు తొలి ప్రాధాన్యత

-విద్య, వైద్య, సాగునీటి రంగాలపై ప్రత్యేక దృష్టి

-హరిత ఇంధన రాష్ట్రంగా తెలంగాణ

-ప్రజా పాలన దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ రాష్ట్రంలో సాగుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు రైతాంగానికి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పదంలో నడిపించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో పయనించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సెప్టెంబర్ 17న భారతదేశంలో అంతర్భాగంగా తెలంగాణ మారిందన్నారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం ఉద్యమించిన యోధుల వెలకట్టలేని త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని విక్రమార్క గుర్తు చేశారు. సబ్బండ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన తెలిపారు. ఉచిత బస్సు, రైతు భరోసా, గృహ జ్యోతి కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా అనేక మంది లబ్ది పొందుతున్నారని 2030 నాటికి తెలంగాణలో 20వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన మిగతా 2లో..

## అన్ని రంగాల్లో భద్రాద్రి అభివృద్ధికి కృషి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి కుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఐడిఓసిలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. విద్యవైద్యం వ్యవసాయ మౌళిక వసతులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. జిల్లాలో మెడికల్ ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీతో విద్యావైద్య రంగాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. రహదారుల రైల్వే మార్గాన్ని అనుసందానం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాండురంగాపురంభద్రాచలంమల్కనగిరి రైల్వే మార్గం అమరావతిజగ్దల్పూర్ జాతీయ రహదారి అభివృద్ధికి చర్యలు సాగుతున్నాయని చెప్పారు. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుతో పాటు గోదావరి నదీ రవాణా అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో భద్రాచలం పర్యాటక అభివృద్ధికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకట్రావు కోరం కనకయ్య జారే ఆదినారాయణ కలెక్టర్ అంకిత్ ఎస్‌పి రోహిత్ రాజు అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పి సిఇఓ నాగలక్ష్మి జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రూ.2.20కోట్లు వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- తిరుమలాయపాలెం పర్యటనలో మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని మేడిదపల్లి సుబ్లేడు రహదారి నుంచి ఎస్ఆర్‌ఎస్పీ కాలువ కట్ట మీదుగా బీరోలు రోడ్డు వరకు రూ.2.20కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలో ఒకటి, రెండు, మూడు విడతల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతీ పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, భూభారతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న అర్హులైన వారికి నూతన పింఛన్లు అందిస్తామని, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. నీటి ఎద్దడి ఏర్పడే పరిస్దితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా తక్కువ మిగతా 2లో..

# తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శం

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహారావు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం, దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో నైజాం నవాబు, జమీందారులు, జాగీర్దారుల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహారావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని యాతాలకుంటలో కొరస జోగయ్య, కొరస పెంటమ్మల స్థూపాల వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ నాయకత్వంలో సాగిన పోరాటం సామాన్య ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, బందగీ వంటి సామాన్యులు సైతం పోరాట యోధులుగా నిలిచారని తెలిపారు. నాటి పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, తోట రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి తడకమళ్ల యోబు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/వైరా:** గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతం వరకు పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు పాత తండాలో బంజారా గిరిజనులు, బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలు, పాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బానోతు చంద్రావతి మాట్లాడుతూ తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలనే గిరిజనుల దీర్ఘకాల డిమాండ్‌ను కెసిఆర్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం తండాలకు గ్రామపంచాయతీ హోదా కల్పించిన ఘనత కెసిఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు గుగులోతు రాము, వాంకుడోతు వీరన్న, బానోత్ క్రిష్ణ, గుగులోతు శివ, కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు, లాల్‌మహ్మద్, మిషన్ భగీరథ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల రవి, ఆదూరి ప్రేమ్, తిరుపతి శ్రీను, నూకల వాసు, ఏదునూరి శ్రీను, మరికంటి శివ, తడికమళ్ల నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి దేవరాజ్, విలాసాగరం నరేష్, పాసంగులపాటి శివ, దామ శ్రీను, లాలాపురం పాషా, వేముల శివకుమార్, మదుపల్లి కృష్ణ, యంద్రాతి గోపాలరావు, పారుపల్లి నాగం, సోమవరం మల్లెపురం, దొంతెబోయిన వెంకటనారాయణ, మాచర్ల శంకర్, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఏరియాలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ సత్తుపల్లి ఏరియాలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి సత్తుపల్లి స్పెషల్ ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటచారి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జీఎం ఎస్. వెంకటచారి మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా, సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో ఉద్యోగులు, అధికారులు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సెక్యూరిటీ సిబ్బంది జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ వేడుకలకు ఎస్ ఓ టు జీఎం బొల్లం శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి సుముద్రాల సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, సీఎంఓఏఐ సత్తుపల్లి ఏరియా ప్రెసిడెంట్ ఏ.ఎల్. ఎస్. వి. సునీల్ వర్మలతో పాటు సత్తుపల్లి ఏరియా ఇంజనీర్, పర్చేస్ ఆఫీసర్, గనులు, డిపార్ట్‌మెంట్ల హెచ్‌ఓడీలు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఇల్లు..!

**- చిన్నారిని కాటేసిన కట్లపాము**
**-భయం గుప్పెట్లో బతుకులు**
**- పక్కా ఇళ్లు మంజూరు చేయాలని వేడుకోలు**



**ప్రజాపక్షం/ముదిగొండ:** శిథిలావస్థకు చేరిన ఇంట్లో పాములు, తేళ్లు వంటి విషపూరితాలు సంచరిస్తుండటంతో ఓ కుటుంబం తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తోంది. ఇంటి గోడలు, పైకప్పు బలహీనంగా మారడంతోపాటు విష సర్పాలు తరుచూ ఇంట్లోకి వస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ముదిగొండ గ్రామానికి చెందిన వల్లంకొండ కుటుంబం కొంతకాలంగా ఈ శిథిల ఇంట్లోనే నివసిస్తోంది. ఇటీవల రాత్రి వేళ కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న వల్లంకొండ మెర్సీని కట్లపాము కాటేసింది. దీంతో కుటుంబసభ్యులు భయాందోళనకు గురై వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సకాలంలో వైద్యం అందడంతో పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ, ఈ ఘటన కులుంబంలో మరింత భయాన్ని నింపింది. ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షాలు, రాత్రివేళల్లో పాములు, తేళ్లు ఇంట్లోకి వస్తున్నాయని కుటుంబసభ్యులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పటికే చిన్నారి పాముకాటుకు గురైన నేపథ్యంలో మరోసారి విషసర్పం ఇంట్లోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించాల్సి వస్తోందని వాపోతున్నారు.

**- ఇక ఈ ఇంట్లో ఉండలేం..**

శిథిలమైన ఇంట్లో పిల్లలతో కలిసి నివసించడం తమకు తీవ్ర ఇబ్బందిగా మారిందని కుటుంబసభ్యులు తెలుపుతున్నారు. ఇంటి పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని అర్హత మేరకు ప్రభుత్వ గృహ పథకం ద్వారా పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. పాము కాటుకు గురైన చిన్నారి పరిస్థితిని కూడా దృష్టిలో ఉంచుకుని అత్యవసర సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**- అధికారులు స్పందించాలని గ్రామస్తుల విజ్ఞప్తి**

ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి కుటుంబానికి భద్రమైన నివాసం కల్పించే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. శిథిల ఇంటిని పరిశీలించి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడంతోపాటు అర్హత ఉన్నట్లయితే ప్రభుత్వ గృహ పథకంలో ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారి పాముకాటుకు గురైన ఘటన దృష్టిలో ఉంచుకుని కుటుంబ భద్రతకు అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/మధిర:** నిజాం రాచరిక భూస్వామ్య వ్యవస్థ నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించడంలో కమ్యూనిస్టుల రక్తం, త్యాగం, పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గ్రామ రక్షణ దళాలను ఏర్పాటు చేసి ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని నింపింది సిపిఐ. గత చరిత్రపై ఏ మాత్రం అవగాహన లేని వాళ్లు, సాయుధ తెలంగాణ విలీన పోరాటంలో ఏ మాత్రం పాల్గొనని వాళ్ళు, ఆర్ఎస్ఎస్, బిజెపి వాళ్ళు ఏదో వీళ్ళే పోరాడి తెలంగాణని నిజాం నిరంకుశత్వ పాలన నుండి ప్రజలను కాపాడినట్లు బిల్డప్ ఇవ్వడం చూస్తుంటే నాటి పోరాట అమరుల ఆత్మలు ఘోషిస్తాయని బెజవాడ రవి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మీలాగా అధికారం కోసం జరిపిన బాబ్రీ మసీద్ కూల్చివేత పోరాటం కాదు. తరతరాలుగా అణచివేతకు గురికావడ్డ మట్టి మనుషులు చేసిన వీరోచిత పోరాటం. సాయుధ పోరాటం ద్వారా చేసిన తిరుగుబాటుకు భయపడి నిజాంలో లొంగిపోయి నైజాం స్టేట్‌ను భారతదేవంలో విలీనం చేశాడని బెజవాడ రవి అన్నారు.

# శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి




**ప్రజాపక్షం/మధిర:** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షనమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మధిర మండలం కాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ మధిర మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని ఆయన పేర్కొన్నారు. దీనిని శక్తి శాఖలో కలపడం వలన విద్యా వ్యస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యంగల ఉజ్వల్ చరణ్, మధిర మండల కార్యదర్శి అశోక్, మండల సహాయ కార్యదర్శి అక్షిత, సత్య, మండల నాయకులు సాయి, వెంకట్, హుస్సేన్, మౌనిక, శ్వేత, రమ్య, దివ్య, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి చార్లెస్‌కు ఎమ్మెల్యే అండ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని 14వ వార్డుకు చెందిన చిన్నారి చార్లెస్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ స్పందించారు. ఆమె సూచన మేరకు కాంగ్రెస్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎండీ రిహానా కమల్ పాషా, ఎమ్మెల్యే బృందం చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. తక్షణ సాయంగా రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్సకు అవసరమైన తక్షణ సహాయం అందిస్తామని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

# వేల మైళ్ల దూరంలోనూ మానవత్వం

## తండ్రి ద్వారా ఆర్థికసాయం అందించిన తనయుడు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న సత్తుపల్లికి చెందిన చిన్నారి ఛార్లెస్ ఫిన్నీ పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న అమెరికా డల్లాస్‌లో నివసిస్తున్న ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు కుమారుడు చల్లగుళ్ల నిఖిల్ స్పందించారు. చిన్నారి వైద్య చికిత్స కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. దూరంగా ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న చిన్నారికి ఈ ఆర్థిక సాయాన్ని తన తండ్రి ద్వారా చేయూతనందించిన నిఖిల్‌ను పలువురు అభినందించారు. చిన్నారి ఛార్లెస్ ఫిన్నీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



**ప్రజాపక్షం/వైరా:** వినాయక చవితి నిమజ్జనాల నేపథ్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని నల్ల చెరువులో అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల24,25 తేదీల్లో నిమజ్జనాలు జరగనున్న నేపద్యంలో పామాయిల్ తోట సమీపంలోని నల్ల చెరువును మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశీలనలో మున్సిపల్ కమీషనర్ ఎం.రామచంద్రరావు, తహశీల్దార్ సురేష్‌బాబు, ఎస్సై పుష్పాల రామారావు, మండల పరిషత్ సూపరిండెంట్ వెంకటేశ్వరరెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరావు, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములు, పమ్మి అశోక్, చెరుకూరి కిరణ్, మున్సిపల్ అధికారులు సుధీర్, వెంకన్న పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/మధిర:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మధిర మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు, ప్రజాపాలన యొక్క ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోన ధనికుమార్, మున్సిపల్ కమీషనర్ సామ్యూల్‌పాల్, వార్డు కౌన్సిలర్లు, డవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయలకు శాస్త్రీయ సాగు.. రైతులకు లాభాలు బాగు..!

**-ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడులు**
**-నేల పరీక్ష, నాణ్యమైన విత్తనం, నీటి యాజమాన్యమే కీలకం**





ప్రజాపక్షం/ తల్లాడ : కూరగాయల సాగు రైతులకు తక్కువ కాలంలో ఆదాయం అందించే పంటల్లో ఒకటి. అయితే విత్తన ఎంపిక నుంచి కోత వరకు శాస్త్రీయ పద్ధతులను పాటించకపోతే పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, చీడపీడల ఉధృతి, నీటి కొరత నేపథ్యంలో కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులకు ప్రాధాన్యత పెరుగుతుంది. పంట వేసే ముందు భూసార పరీక్ష చేయించడం ఎంతో ముఖ్యమని, నేలలో ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించడం ద్వారా ఖర్చును తగ్గించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. పంటకు అనుకూలమైన నేలను ఎంపిక చేసుకోవడంతో పాటు సరైన పంట మార్పిడిని పాటించడం వల్ల నేల సారాన్ని కాపాడుకోవచ్చు.

### నాణ్యమైన విత్తనాల ఎంపిక...

అధిక దిగుబడి ఇచ్చే స్థానిక వాతావరణానికి అనుకూలమైన నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు. విత్తన శుద్ధి చేసి నాటడం వల్ల ప్రారంభ దశలో వచ్చే కొన్ని తెగుళ్లను నియంత్రించవచ్చు. నర్సరీలో ఆరోగ్యకరమైన మొక్కలను పెంచి పొలంలో నాటడం కూడా మంచి ఫలితాలను ఇస్తుందన్నారు.

### డ్రిప్‌తో నీటి పొదుపు...

కూరగాయల సాగులో నీటి యాజమాన్యం కీలకమని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మొక్కల వేర్లకు అవసరమైనంత నీటిని అందించవచ్చున్నారు. దీనితో నీటి వృథా తగ్గడంతో పాటు ఎరువులను నీటితో కలిపి అందించే అవకాశం ఉంటుంది. మల్చింగ్ విధానాన్ని అనుసరించడం ద్వారా నేలలో తేమ నిల్వ ఉండడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను



కొంత వరకు నియంత్రించవచ్చు.

### ఎరువుల్లో సమతుల్యత అవసరం...

ఎక్కువ ఎరువు వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనే అపోహను పక్కన పెట్టి నేల పరీక్ష ఆధారంగా సేంద్రియ ఎరువులు, అవసరమైన రసాయన ఎరువులను సమతుల్యంగా ఉపయోగించాలన్నారు. అధిక నత్రజని వినియోగం వల్ల కొన్ని కూరగాయల్లో మొక్కల పెరుగుదల ఎక్కువైనా నాణ్యత, తెగుళ్ల సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు.

### చీడ పీడలపై ముందస్తు నిఘా...

కూరగాయల్లో పురుగులు, తెగుళ్ల వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. అందుకే పంటను క్రమం తప్పకుండా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. సమగ్ర సస్యరక్షణ విధానంలో భాగంగా పసుపు, నీలం జిగురు అట్టలు, ఫెరోమోన్ ట్రాప్స్, జీవ నియంత్రణ పద్ధతులు వంటి వాటిని అవసరానికి అనుగుణంగా ఉపయోగించవచ్చు. పురుగు కనిపించిందని వెంటనే మందులు పిచికారి చేయకుండా వ్యవసాయ అధికారుల సూచనలతో తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### పంట ఎంపికలో మార్కెట్ కూడా ముఖ్యం...

రైతు ఏ కూరగాయ సాగు చేయాలనేది కేవలం దిగుబడిని బట్టి నిర్ణయించకూడదని స్థానిక మార్కెట్‌లో డిమాండ్, ధరల పరిస్థితి, రవాణా సౌకర్యం, పంట కోతకు పట్టే సమయం వంటి అంశాలను పరిశీలించాలి. ఒకే పంటపై ఆధారపడకుండా అవసరాన్ని బట్టి వివిధ రకాల కూరగాయలను సాగు చేయడం ద్వారా ధరల మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.

### కోత, నిల్వ, మార్కెటింగ్...

కూరగాయలను సరైన దశలో కోయడం వల్ల నాణ్యతను కాపాడుకోవచ్చు. కోత అనంతరం నీడలో ఉంచడం, శుభ్రపర్చడం, గ్రేడింగ్ చేయడం, ప్యాకింగ్ చేయడం ద్వారా మార్కెట్‌లో మంచి ధర పొందే అవకాశం ఉంటుంది. రైతులు నేరుగా మార్కెట్లు, రైతు బజార్లు లేదా వినియోగదారులకు విక్రయించే మార్గాలను కూడా పరిశీలించాలి. శాస్త్రీయ సాగు అంటే కేవలం కొత్త పద్ధతులను అనుసరించడం మాత్రమే కాదు. నేల, నీరు, విత్తనం, ఎరువులు, సస్యరక్షణ, మార్కెటింగ్ అన్నింటిని సమన్వయంతో నిర్వహించడం. వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారుల సలహాలు తీసుకుని పంటను సాగు చేస్తే పెట్టుబడి నియంత్రణతో పాటు నాణ్యమైన దిగుబడికి అవకాశాలు పెరుగుతాయి.

# స్మార్ట్ ఫోన్.. పిల్లల పాలిట సైలెంట్ కిల్లర్..!



ప్రజాపక్షం/మణుగూరు: నేటి డిజిటల్ యుగంలో చిన్న పిల్లల చేతుల్లో స్మార్ట్ ఫోన్ అనేది ఒక సాధారణ వస్తువుగా మారిపోయింది. కానీ అది వారి మానసిక, శారీరక ఆరోగ్యంపై ఎంతటి భయంకరమైన ప్రభావాన్ని చూపుతుందో వీడియోలో చూపిస్తున్న దృశ్యాలు మన కళ్ల తెరిపిస్తున్నాయి. దీనిని వైద్య పరిభాషలో నోమోఫోబియా లేదా సెల్ ఫోన్ అడిక్షన్ డిజార్డర్ గా పిలుస్తారు. ఫోన్ చేతిలో నుంచి లాక్కున్నప్పుడు పిల్లలు విపరీతమైన కోపానికి లోనవుతారు మరియు భరించలేని విధంగా ఏడుస్తూ అల్లరి చేస్తారు.

### నియంత్రణ కోల్పోవడం...

ఫోన్ కోసం ఎంతటి మొండితనానికైనా లేదా ఆవేశానికైనా వెనుకాడనంతగా వారి మానసిక స్థితి మారిపోతుంది. ఈ వ్యసనం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చే వరకు పైకి ఎలాంటి ముందస్తు సంకేతాలు కనిపించకపోవచ్చు, నడక్గా ప్రవర్తనలో మార్పులు బయటపడతాయి.

### తల్లిదండ్రుల పాత్ర - ఎక్కడ పొరపాటు జరుగుతోంది...?

నేటి కాలంలో దాదాపు 90% మంది తల్లిదండ్రులు పిల్లలు అల్లరి చేస్తున్నారనో, లేదా తమ పనులకు అడ్డు రాకుండా ఉండాలనో వారి చేతికి మొబైల్ ఫోన్లు ఇస్తున్నారు. పిల్లలను బుజ్జగించడానికి లేదా వారు అన్నం తినడానికి ఫోన్లను ఒక సాధనంగా వాడుతున్నారు.

### ముఖ్య గమనిక...

పిల్లలకు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, ఓపిక నేర్పించాల్సింది పోయి, తాత్కాలిక ఉపశమనం కోసం ఫోన్ల అలవాటు చేయడం వారి భవిష్యత్తును మరియు మానసిక ఎదుగుదలను దెబ్బతీస్తుంది.

### వైద్యుల షాకింగ్ హెచ్చరిక..!

వైద్య నిలయం డాక్టర్లు ఏమి చెప్తున్నారంటే...

**స్క్రీన్ టైమ్ పరిమితి :**

పిల్లలకు రోజులో నిర్ణీత సమయం కంటే ఎక్కువ ఫోన్ ఇవ్వకూడదు. వీలైతే చిన్న వయసులో అస్సలు అలవాటు చేయకపోవడమే మంచిది.

క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన జబ్బు..

ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ అడిక్షన్ అనేది క్యాన్సర్ కంటే భయంకరమైన వ్యాధిగా మారుతోంది. క్యాన్సర్ శరీరానికి హాని చేస్తే, ఈ వ్యసనం పిల్లల మెదడును, వారి భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుంది. విపరీతమైన మొండితనం మరియు క్రూరత్వంఫోన్ కోసం పిల్లలు ఎంతటి ఆవేశానికైనా లోనవుతారు. ఒక స్మార్ట్‌ఫోన్ కోసం అవసరమైతే ఎదుటి మనిషిని చంపడానికి లేదా తమను తాము గాయపరచుకోవడానికి కూడా వెనకాడనంతగా వారి మానసిక స్థితి క్రూరంగా మారుతుంది.

### తల్లిదండ్రులారా... తప్పు మీదే...

దాదాపు 90% మంది తల్లిదండ్రులు పిల్లలు అల్లరి చేస్తున్నారనో, లేదా తాము ప్రశాంతంగా పనులు చేసుకోవచ్చనో వారి చేతికి ఫోన్లు ఇస్తున్నారు. పిల్లలను కంట్రోల్ చేయడానికి క్రమశిక్షణ నేర్పాల్సింది పోయి, ఫోన్‌ను ఒక లంచంలాగా వాడుతున్నారు. దీనికి ముమ్మాటికీ తల్లిదండ్రులే బాధ్యులని డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు.

### డాక్టర్ల ముఖ్యమైన సలహాలు (చేయవలసిన మార్పులు)...

ఫోన్‌ను పూర్తిగా దూరం పెట్టండి. చిన్న పిల్లలకు స్మార్ట్ ఫోన్ల అస్సలు అలవాటు చేయవద్దు. పిల్లలు ఏడిస్తే ఫోన్ ఇవ్వడం ఆపేయండి. వారి ఏడుపును ఓపికతో భరించండి కానీ ఫోన్ వైపు మళ్లించకండి. పిల్లలతో కలిసి సమయం గడపండి. వారికి ఇండోర్, అవుట్‌డోర్ ఆటలు మరియు పుస్తక పఠనం అలవాటు చేయండి. దయచేసి పిల్లలకు స్మార్ట్ ఫోన్ అలవాటు చేయకండి. మీ చేతులతోనే మీ పిల్లల జీవితాలను నాశనం చేసుకోకండి!

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/చింతకాని : ప్రజాపాలనదినోత్సవ వేడుకలు చింతకాని మండల వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కరుణశ్రీ ,మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు ,పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జి నరేష్ ,ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ అల్తాఫ్, ఐకెపి కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గంధం కవిత గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు , మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, చింతకాని, నాగులవంచ సహకార సంఘాల్లో చైర్మన్లు శేఖర్‌రెడ్డి, నల్లమోతు శేషగిరి, రైతు వేదికల్లో ఏఈవోలు జాతీయజెండా ఎగురవేశారు.

# సైన్స్ మ్యూజియంలో ఆదర్శ విద్యార్థుల సందడి



ప్రజాపక్షం/చింతకాని : పుస్తకాల్లో చదివిన సైన్స్ పాఠాలను కేవలం చదివి వదిలేయకుండా .. వాటిని కళ్లారా చూసి ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారు నాగులవంచ ఆదర్శ పాఠశాల విద్యార్థులు. గురువారం ఖమ్మం నగరంలో సైన్స్ మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థులు ఫిజికల్ సైన్స్, జీవశాస్త్రం, రసాయన శాస్త్రానికి సంబంధించిన పలు ప్రయోగాలను ఆసక్తిగా పరిశీలించారు. మ్యూజియం నిర్వాహకులు వివిధ ప్రయోగాల పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరిస్తూ వాటి వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను తెలియజేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆసక్తిని పెంపొందించేలా సైన్స్ మ్యూజియం సందర్శనను ఏర్పాటు చేసిన పాఠశాల నిర్వాహకులను అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సదానందం అభినందించారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థి ప్రతిభ



ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం : స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థి ఓ.ఆర్యన్ షణ్ముఖ్‌శ్రీరామ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 15 చెస్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుని విజయ దుంధుభి మోగించాడు. గురువారం స్కూల్‌లో జరిగిన అభినందన సభలో పాఠశాల డైరెక్టర్స్ కె.శ్రీధర్‌రావు, కృష్ణవేణి ట్రోఫీ, పతకాలు సాధించిన విద్యార్థి షణ్ముఖ్‌ను అభినందించి ఆశీర్వదించారు. 13 సంవత్సరాల వయస్సులోనే చెస్‌లో ఎంతో నైపుణ్యాన్ని సాధించి తన ప్రతిభతో జిల్లా, రాష్ట్రస్థాయిలలో విజయాలను సాధిస్తున్న స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో విజయాలను సాధించి తల్లిదండ్రులకు దేశానికి గొప్ప పేరు తేవాలంటూ ఆకాంక్షించారు. తమ పాఠశాలలో ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత ప్రణాళికలను అమలుపరుస్తునందున అనిన రంగాల్లో విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెంది అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# త్రివేణి విద్యార్థినిని అభినందించిన అడిషనల్ కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం విద్యా విభాగం : జాతీయ సైన్స్ సెమినార్ 2026లో భాగంగా ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047 ప్రాస్పెక్ట్స్ ఛాలెంజెస్ అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో త్రివేణి పాఠశాల ఖమ్మంశాఖకు చెందిన కె.వనిషారెడ్డి ప్రథమ స్థానం సాధించారు. జిల్లా సైన్స్ మ్యూజియంలో నిర్వహించిన ఈ పోటీలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం, ఇన్‌చార్జి డిఎస్‌ఓ వెంకటేశ్వర్లు ఈ విద్యార్థిన్ని, గైడ్ టీచర్స్ బాలాజీ, పరీక్షలను అభినందించారు. విద్యార్థిని వనీషారెడ్డికి పాఠశాల డైరెక్టర్ డా గొల్లపూడి వీరంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పోడు భూములకు పట్టాలివ్వాలి



ప్రజాపక్షం/పెనుబల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఉప్పలచెలక గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక పోరాటమని అన్నారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి చెమట విశ్వనాథం, జొన్నలగడ్డ రవి పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జాతీయ పతాకావిష్కరణ నిర్వహించారు. తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు, బి బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ వాసుదేవరావు, నాయకులు తిరుపతి చంటి, కొట్టే అనిల్ కుమార్, బర్మావత్ రాంబాబు నాయక్, జీపీవోలు ప్రసాద్, వెంకన్న, ఆర్ఐ, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ముంచుతున్న ఆర్గనైజర్ల మాయాజాలం..!








**-మొక్కజొన్న సీడ్ కంపెనీల్లో ఉద్యోగం**
**-ఎరువుల డీలర్లతో ములాఖత్..?**
**-12 ఎకరాల్లో 44 టన్నుల దిగుబడి**
**-రూ.14.96 లక్షలు రావాల్సి ఉండగా**
**రూ.9 లక్షలే చెల్లించారంటున్న రైతు**
**-ఖర్చుల పేరుతో రూ.5.96 లక్షలు**
**ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మొక్కజొన్న సీడ్ కంపెనీలలో ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్న కొందరు వ్యక్తులు రైతులకు తొలుత భారీ లాభాల ఆశలు చూపించి, పంట చేతికొచ్చిన అనంతరం వివిధ రకాల ఖర్చులు చూపుతూ రైతులకు రావాల్సిన సొమ్ములో కోతలు పెడుతున్నారనే ఆరోపణలు సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో కలకలం రేపుతున్నాయి. పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ అంటూ నమ్మించి, చివరకు ఖర్చుల లెక్కలతో రైతులను నష్టాల్లోకి నెట్టేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సదాశివునిపాలెం గ్రామానికి చెందిన రైతు యనమందల భాస్కర్‌రావు తనకు జరిగిన అన్యాయంపై పోరాటానికి సిద్ధమవుతూ 'ప్రజాపక్షం'ను ఆశ్రయించారు. రైతు వివరాల ప్రకారం.. సుమారు 12 ఎకరాల్లో మొక్కజొన్న సీడ్ పంట సాగు చేయగా 44 టన్నుల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. టన్నుకు రూ.34 వేల చొప్పున ధర నిర్ణయిస్తే మొత్తం రూ.14.96 లక్షలు రావాల్సి ఉండగా, ఆర్గనైజర్ ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.9 లక్షలు మాత్రమే అందాయని రైతు చెబుతున్నారు. మిగిలిన రూ.5.96 లక్షల కోసం ప్రశ్నించగా, ఒక్కో ఎకరానికి సుమారు రూ.1.40 లక్షల వరకు ఖర్చులు చూపిస్తూ తమకు ఎలాంటి బకాయిలు లేవని చెబుతున్నారని భాస్కర్‌రావు ఆరోపించారు. ఖర్చుల లెక్కలపై తమకు అనుమానాలు ఉన్నాయని, తాము చేయని ఖర్చులను కూడా తమ ఖాతాలో చూపిస్తున్నారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**ఇతర రైతు పేరుతో ఖాతా..**

**రూ.2 లక్షల పెట్టుబడి..?**

రైతుకు విత్తనాలు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో సదాశివునిపాలెంకు చెందిన మరో రైతు పేరుతో ఖాతా ప్రారంభించి, ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలోని మొక్కజొన్న సీడ్ కంపెనీ నుంచి పెట్టుబడి నిమిత్తం రూ.2 లక్షలు ఇప్పించినట్లు సంబంధిత ఆర్గనైజర్ వివరణలో పేర్కొన్నారు. అనంతరం తాను కూడా భాగస్వామ్యంగా వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చినట్లు ఆర్గనైజర్ చెప్తున్నాడు. అయితే, ఖర్చులు అధికమవుతున్నాయని తాను ఇకపై వ్యవహరించనని చెప్పిన సదరు వ్యక్తి.. కంపెనీ నుంచి వచ్చిన డబ్బును తిరిగి కంపెనీకే చెల్లిస్తానని చెప్పి తమను మొక్కజొన్న సీడ్ సాగుకు ఒప్పించాడని భాస్కర్‌రావు ఆరోపిస్తున్నారు.ఎ

**రువుల ఖాతాలోనూ అక్రమాలున్నాయా?...**

మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలోని ఓ ఎరువుల దుకాణంలో మరో రైతు పేరుతో ఉన్న ఖాతాను ఉపయోగించి, తమ పంటకు అవసరమైన దానికంటే అదనంగా ఎరువులు తీసుకెళ్లి ఆ ఖర్చులను తన ఖాతాలో నమోదు చేశారని భాస్కర్‌రావు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా అదనపు ఖర్చులు చూపించి రైతుకు చెల్లించాల్సిన మొత్తాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని వారు పేర్కొన్నారు.

**పెద్దల సమక్షంలో పంచాయితీలు..**

**అయినా పరిష్కారం కాలేదంటూ ఆవేదన..**

ఈ వ్యవహారంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని రైతు కుటుంబం చెబుతోంది. కంపెనీ నుంచి డబ్బులు తీసుకున్న అనంతరం ఆర్గనైజర్ ఫోన్లు ఎత్తకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు.తమకు జరిగిన అన్యాయం మరే రైతుకూ జరగకుండా సంబంధిత అధికారులు సీడ్ కంపెనీ, ఆర్గనైజర్, ఎరువుల దుకాణాల లావాదేవీలు, ఖర్చుల బిల్లులు, రైతు ఖాతాలు, పంట విక్రయ వివరాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని బాధిత రైతు కోరుతున్నారు.

# భీమవరంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**నలుగురు అరెస్ట్.. రూ.29,600 నగదు, పేకముక్కలు, బైక్, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వేంసూరు మండలం భీమవరం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ పల్లెల ప్రదీప్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన దాడిలో నవకుమార్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాగయ్య పట్టుబడ్డారు. మరో ఆరుగురు పరారైనట్లు పోలీసులు తెలిపారు. దాడిలో 52 పేకముక్కలు, రూ.29,600 నగదు, ఒక బైక్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఎస్టీల అభ్యున్నతి, అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను గుర్తు చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర ఎస్టీ నాయకత్వం పిలుపు మేరకు ఇల్లందు మండలం సుభాష్‌నగర్‌లో కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్, పార్టీ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10శాతానికి పెంచిన నిర్ణయం, తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చడం, మౌలిక వసతుల కల్పన, పోడు భూములకు పట్టాల పంపిణీ వంటి చర్యలు గిరిజనుల అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ నాయకులు, గిరిజన నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:**సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్ డిమాండ్ చేశారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఇల్లందు మండలం 21పిట్‌లో విఠల్‌రావు విగ్రహం, పట్టణ పా బస్టాండ్ సెంటర్‌లో కొమరయ్య విగ్రహాల వద్ద అమరవీరులకు నివా ళులర్పించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఈ చరిత్రను భావితరాలకు తెలియజేసేలా పాఠ్యాంశా ల్లో చేర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో బాస శ్రీనివాస్, బొప్పిశెట్టి సత్యనారాయణ, ఎండి నజీర్ అహ్మద్, గుగులోత్ కృష్ణ, షేక్ ఖాసీం, ఉడుత ఐలయ్య, నెల్లి కొమరయ్య, షేక్ వలి, బైరవేణి సదానందం, బాషపాక రవి, చాట్ల గణపతి, ఆలేం రాఘవేంద్రరావు, బంటు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల కేంద్రమైన కామేపల్లిలో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ పతాకాలను ఎగురవేసి, ప్రజా పాలన విశిష్టతను వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సోమ్లాల్, ఎంఈఓ వెంకట్, ఏవో తారాదేవి, ఏపిఎం రామారావు, ఏపీఓ శ్రీరాణి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని భాజపా ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలం సారపాకలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మోదీ పేరుతో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తక్కెళ్ల భూమి తమకే అప్పగించాలి

**-నాయకపోడు గిరిజనుల డిమాండ్**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం నాయకపోడు గిరిజనులు తమ హక్కుల కోసం పోరుబాట పట్టారు. నర్సాపురం పరిధిలోని తక్కెళ్ల భూమిని 1957నుంచి సాగు చేసుకుంటూ, దాని ఆదాయంతో తమ ఆరాధ్య దైవాల జాతరలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొన్నేళ్ల క్రితం సుమారు నాలుగు ఎకరాలను గ్రామకంఠం భూమిగా చూపించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారని ఆరోపించారు. మిగిలిన భూమిలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, తమకు సమాచారం లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకపోడు సంఘం పెద్ద పోతిని రాములు మాట్లాడుతూ తక్కెళ్ల భూమిలో సబ్ స్టేషన్‌కు అనుమతులు ఇవ్వకూడదన్నారు. అసలు రెవెన్యూ రికార్డులను పరిశీలించి భూమి వివరాలను బహిర్గతం చేయాలని, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాలనికి భూమి ఎలాటి కేటాయించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపి హక్కులు కల్పించడంతో పాటు, భూమి నష్టానికి పరిహారం చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకపోడు గ్రామ అధ్యక్షుడు బూరుగు సీతయ్య, గుజ్జుల నాగరాజు, పోతిని నరసింహారావు, నల్లమోతుల గోపాలకృష్ణ, పోతిని రంగా, వాసం గోపాలరావు, శేఖర్, కుషిని గోపాలకృష్ణ, పోతిని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురంలో పారిశుధ్య నిర్వహణకు మరింత ఊతం



**ప్రజాపక్షం/అశ్వాపురం :** గ్రామ పంచాయితీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు మరింత పటిష్టం చేసేందుకు నూతన మహీంద్రా 475 ట్రాక్టర్ అందుబాటులోకి వచ్చింది. కోదండ రామాలయం సమీపంలో సర్పంచ్ బానోత్ సదర్ లాల్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఒక్క ట్రాక్టర్‌తో రోడ్డు పాయింట్లతో పాటు అంతర్గత వీధుల్లో చెత్త సేకరణ నిర్వహించాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి, నూతన ట్రాక్టర్‌తో ఒకదానిని రోడ్డు పాయింట్ల పారిశుధ్యానికి, మరొకదానిని ఇంటింటా చెత్త సేకరణకు వినియోగించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. దీంతో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించే అవకాశం ఏర్పడిందన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో నూతన ట్రాక్టర్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రతి వీధి పరిశుభ్రతే లక్ష్యంగా పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని, ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ తుల్లూరి ప్రకాశరావెడు, పంచాయితీ కార్యదర్శి యాకూబ్, వార్డు సభ్యులు నూకల లింగయ్య, చిక్కా పద్మ, వేములపల్లి హసిత, జరుపుల కౌసల్య, పాయం నాగేంద్రబాబు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లిపాకలో జాతీయ పతాకావిష్కరణ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ 2026లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, నాలుగు రకాల చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామ పంచాయితీ ట్రాక్టర్‌కు అందించే విధానంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతను పాటించడంతో పాటు తల్లిదండ్రులకు చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెల్లిపాక బంజర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పంచాయితీ సిబ్బంది, పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో సారపాక సెంటర్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనానికి కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏనుగు వెంకటరెడ్డి, గుగులోత్ బాలు నాయక్, భూక్యా సీతారాం నాయక్, భూక్యా దివ్యశ్రీ, మండల అధ్యక్షుడు బీరకసాయి శ్రీను, నాయకులు చుక్కపల్లి బాలాజీ, బిజ్జం శ్రీనివాస్ రెడ్డి, కేశగాని శ్రీనివాస్ గౌడ్, గడ్డం సతీష్, వై వెంకటేశ్వరరావు, దుప్పటి సురేష్, కారం సాయి కిరణ్, వెలిశెట్టి రామారావు, జక్కం సత్యనారాయణ, అకిని సర్వేశ్వరరావు, జాదవుల గోవర్ధన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రుగొండ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం జాతీయ పతాకాలను ఎగురవేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివరామకృష్ణ, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం వజీద్, తిప్పనపల్లి పాఠశాలలో ఎంఈఓ సూరయ్య జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఈసందర్భంగా ప్రజాపాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**- జాతీయ జెండా ఎగురవేసిన కలెక్టర్, ఎస్పి, ఐటిడిఏ పిఒ, సబ్ కలెక్టర్**
**- ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాపాలనా దినత్సోవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ అంకిత్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయగీతాలాపన చేశారు. భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో పిఓ రాహుల్ జాతీయ జెండా ఎగురవేశారు. సిబ్బందితో కలిసి గౌరవ వందనం సమర్పించి జాతీయగీతాలాపన చేశారు. ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి రోహిత్‌రాజ్ జాతీయజెండా ఎగురవేసి జాతీయగీతం ఆలపించి గౌరవ వనందనం సమర్పించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ గీతంతో పాటు తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా గ్రంధాలయం ఆవరణలో చైర్మన్ వీరబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. సిబ్బందితో కలిసి మూడు రంగుల జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం నవాబ్ పరిపాలనలో ఉందన్నారు. ఆపరేషన్ పోలో ద్వారా ప్రదాని నెహ్రు, హోంమంత్రి వల్లభాయ్ పటేల్, రక్షణమంత్రి బల్దేవ్ సింగ్ ఆధ్వర్యంలో సైనిక చర్యలు చేపట్టడం ద్వారా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందన్నారు. ఇందు కోసం ఎంతో మంది తెలంగాణ వీరులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని, ఇదే తరహాలో ప్రజల కోసం పనిచేస్తున్న మనంవారికి మేలు జరిగేలా నిబద్దతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, కరుణకుమార్, లలితకుమారి, మణ్మిదుల, ఐటిడిఏ, ఎస్‌పి, సబ్ కలెక్టర్ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేవా సమితి ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం



**-మహిళలు నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలి**
**-సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్**

**ప్రజాపక్షం/మణుగూరు:** మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు తమ కుటుంబాలకు అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో మణుగూరు ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి శిక్షణ తరగతులు గురువారం పి.వి. కాలనీలోని సింగరేణి సేవా సమితి భవన్ లో ప్రారంభమయ్యాయి. టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్ తదితర విభాగాల్లో శిక్షణ అందించే ఈ కార్యక్రమాన్ని సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్, ఏజీఎం (పర్సనల్) అండ్ అధికార ప్రతినిధి ఎస్. రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ మాట్లాడుతూ మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, శిక్షణను ఆచరణాత్మకంగా ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందే అవకాశాలను కల్పించడమే సేవా సమితి కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సర్టిఫికెట్లు భవిష్యత్తులో ఉపాధి లేదా స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషించేందుకు ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, యెల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు, డీవై.పీఎం బి. శ్యామ్ ప్రసాద్, సేవా సెక్రటరీ శ్రీమతి షాకీరా, సేవా సమితి సభ్యులు, శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల ఆరాధ్య దైవం కేసీఆర్ మాత్రమే

**మాజీ ఎమ్మెల్యే సండ్ర**





**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల ఆరాధ్య దైవం కేసీఆర్ మాత్రమే నని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. గిరిజనులకు ఆరు శాతం నుండి 10 శాతం వరకు రిజర్వేషన్లు పెంచి నేటికి నాలుగు సంవత్సరాల పూర్తయిన సందర్భంగా పెనుబల్లి మండలం సూరయ్య బంజర్ తండా లో మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ సాధికుడు కేసిఆర్ చిత్రపటానికి గ్రామస్తులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసిఆర్ హయంలోనే ప్రత్యేక గిరిజన పంచాయతీలు ఏర్పాటు చేయడం జరిగిందని, మన అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, తండాలలో గూడేలలో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత కేసీఆర్ దేనని కొనియాడారు. లంబాడి గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జన్మదినాన్ని, అధికారికంగా నిర్వహించటం జరిగిందని, హైదరాబాదులో సేవాలాల్ భవనం నిర్మించిన ఘనత ఆయనదేనన్నారు. అసెంబ్లీ లో చర్చించే దమ్ము లేకే ప్రతిపక్షలను వాకట్ చేసి సొంత డబ్బా కొట్టుకొని ప్రజలను తప్పు దోవ పట్టించటమే అయన పనిగా ఉందని, ఇప్పుడు ఉన్న ముఖ్యమంత్రి కి కేసిఆర్ కుటుంబం మీద ఉన్నంత శ్రద్ధ ప్రజల మీద లేదన్నారు. అలాగే 22 ఏ మీద సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని హరీష్ రావు విసిరిన సవాల్ ను స్వీకరించే దమ్ము ఉందా, బినామీలు భూ కబ్జాలు ఎవ్వరి ప్రభుత్వం లో నడుస్తున్నాయో ప్రజలు అన్ని గమనించి రాబోవు కాలం లో తగిన బుద్ది చెప్తారని అన్నారు. అసెంబ్లీ ని ఏకపక్షంగా నడిపిస్తూ కూడా కాకి లెక్కలు చూపించటం సరైన ఆధారాలు లేకుండా సమావేశాల్లో మాట్లాడటం ఇదే పెద్ద పనిగా ముఖ్యమంత్రి భావిస్తున్నారని, 3156 తండాలను పంచాయితీలుగా ఏర్పాటు చేసింది కెసిఆర్ ఏ అన్నారు. ఏ గిరిజనా యూనివర్సిటీ లో గిరిజన గురుకులాలు ఏర్పాటు చేసి గిరిజన విద్య అభివృద్ధి కి కృషి చేశారు గిరి వికాస పథకం లో బోర్లు వేయించి బీడు భూములను సేద్యం భూములుగా మార్చిన ఘనత కెసిఆర్ దే అన్నారు. లక్ష మంది గిరిజన రైతులకు 4 లక్షల ఎకరాల పోడు భూములు పట్టాలను ఇచ్చింది ఆయనేనని అన్నారు. ఈ సందర్బంగా ముందుగా వందలాది మంది తో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి ఏర్పాటు చేసిన కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం, పూలభిషేకం మహిళలతో కలసి నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గిరిజన నాయకులు వాంకుడత్ మురళి, వంకుడోత్ రజిత, తేజవత్ తావు నాయక్, మూడు వాసు, వాంకుడోత్ నాగేశ్వరరావు, బానోత్ శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకట్రావు, మాజీ జడ్పీటీసీ చెక్కిలాల మోహన్ రావు, నాయకులు బెల్లం కొండా చలపతిరావు, మందడపు అశోక్ కుమార్, నీలాద్రి బాబు, యలమర్తి శ్రీను, చింతనిప్పు శ్రీనివాసరావు, చెక్కిలాల లక్ష్మ ణ రావు, తన్నీరు కృష్ణ, పొట్లపల్లి నాగప్రసాద్, వేముల సతీష్ ,పెద్దబాబు ఇమ్మడి వెంకటేశ్వరరావు, రాజబాబు, గౌస్ మరకాల చంటి, జనార్ధన్ , కోట ప్రభాకర్, ఆనందరావు, పద్దం శ్రీను, సర్పంచులు మందడపు లీలావతి, బానోతు పాపా, గుగులోత్ హైమావతి, కొంగల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

**- నగర్ మేయర్ మూడ్ గణేష్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రతినిత్యం పారిశుధ్య కార్మికులు సక్రమంగా విధులకు హాజరు కావాలని, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని నగరే మేయర్ మూడ్ గణేష్ హెచ్చరించారు. గురువారం గురువారం ఆయన కార్పొరేషన్ డివిజన్ అటెండెన్స్ పాయింట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సమయ పాలన పాటించాలని, పారిశుధ్యంపై డివిజన్‌లో వస్తున్న ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూసుకోవాలన్నారు. సంబంధిత సూపర్వైజర్లు పని వేళల్లో క్షేత్రస్థాయిలో ఉంటూ కార్పొరేటర్లు, ప్రజలతో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలుతీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమం విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ జవాన్లు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# మేషన్ కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ప్రశాంత్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేషన్ కాలనీ 5వ వార్డులో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు కొనసాగు తున్నాయి. గ్రామ సర్పంచ్ వాడే రాములు పాలకవర్గ సభ్యుల సహకారంతో ప్రత్యేక చొరవ తీసుకుని విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా సర్పంచ్ వాడే రాములు పట్టుదలతో ముందుకు సాగుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానికులు తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచనలు, సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని, సాబీర్ పాషా సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. మేషన్ కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపట్టినందుకు సర్పంచ్ వాడే రాములు, పాలకవర్గ సభ్యులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీ కార్యాలయాలలో జాతీయ జెండా ఆవిష్కరణలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో రుద్రంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ బానోత్ కేస్లీ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ కేస్లీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఎందరో అమరవీరులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ, అమరవీరుల త్యాగాలను వృధా చేయకుండా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథకంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తోపాటు పంచాయతీ సెక్రెటరీ బోగా నరేంద్ర ప్రసాద్, పంచాయతీ పాలక వర్గం మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను కించపరిచే కల్పిత నాయకుడు పుస్తకాన్ని నిషేధించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ ని కించపరుస్తూ హమారా ప్రసాద్ రాసిన కల్పిత నాయకుడు అనే వివా దాస్పద పుస్తకాన్ని తక్షణమే నిషేధించాలని, రచయితపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ మాల మహానాడు మణుగూరు అధ్యక్షులు వేర్పుల నరేష్, ఆధ్వర్యంలో మణుగూరు ఎస్‌హెచ్‌ఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బూర్గుల సతీష్, గౌరవ సలహాదారులు దొడ్డి భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పుల జాన్, ఉపాధ్యక్షులు బూర్గుల సంజీవ రావు, మాల జేఏసి నియోజకవర్గ అధ్యక్షులు చిట్టి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి దాసరి రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిగొండ రామకృష్ణ, డబ్ల్యూసిఎం కుమార్, వేర్పుల నర్సయ్య, మహిళా అధ్యక్షురాలు నీలం పార్వతి, మండల కార్యదర్శి కొప్పుల మౌనిక, వేమూరి కిరణ్, కట్టా నరసింహ, బూర్గుల కరుణాకర్ భీమ్ జై భీమ్ యువజన సంఘం తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నాం : డిఎస్‌పి





**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు సబ్ డివిజన్ నుండి గణేష్ నిమజ్జనానికి కొండాయిగూడెం గోదావరి పుష్కర్ ఘాటు వద్ద ఏర్పాటు సిద్ధం చేస్తున్నామని డిఎస్పి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ, పంచాయతీ, అలాగే జాలర్లతో కూడా మాట్లాడడం జరిగింది. ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా జాగ్రత్తలు వహించేలా అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందని డిఎస్పి రవీందర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మణుగూరు కొండాయిగూడెం గోదావరి తీర ప్రాంతంలో గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని డి.ఎస్.పి రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగబాబు, ఎస్సై రవుఫ్, మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, ఎంపీడీవో, సింగరేణి ఎస్ఓ శ్రీనివాస రావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్లను తొలగించడం అన్యాయం



**-సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అభివృద్ధి పేరుతో పేదల ఇండ్లను తొలగించడం అన్యాయమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. ఖమ్మం నగరంలోని 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో పేదల ఇండ్లను తొలగించేందుకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం బైపాస్ రోడ్డులో ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటూ పట్టాలు పొంది ఇంటి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. పలువురికి ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు కూడా మంజూరయ్యాయన్నారు. అటువంటి పేదల ఇండ్లను తొలగించేందుకు అభివృద్ధి పేరుతో నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న టింబర్ డిపోలను ఊరి బయటకు మార్చాలని డిమాండ్ చేశారు. పేదల ఇండ్ల జోలికి వస్తే సహించేది లేదని వారు పక్షాన పోరాడతామన్నారు. గతంలో పువ్వాడ నాగేశ్వరరావు ఎంఎల్ఎగా ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, యానాలి సాంబశివారెడ్డి, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, ఎస్‌కె సైదా, నామా విజయ్‌కుమార్, జ్వాలా నర్సింహారావు, ఎస్‌కె చాన, ఎండి మజీద్, ఎస్‌కె కరీం, ఎం. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పిల్లల క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పిల్లల క్యాన్సర్‌పై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద ఆసుపత్రి పిడియాట్రిక్ అంకాలజీ, హెమటాలజీ క్లినికల్ డైరెక్టర్ హెచ్ వోడి డాక్టర్ పరిణిత రెడ్డి గుత్తా తెలిపారు. చిన్న పిల్లల క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స అందిస్తే 80 శాతం వరకు పూర్తిగా నయం చేయవచ్చునని తెలిపారు. గురువారం ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిన్న పిల్లల క్యాన్సర్ చికిత్సలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న డాక్టర్ పరిణిత రెడ్డి మాట్లాడుతూ పుట్టిన నాటి నుంచి 18 ఏళ్ల వయస్సు వరకు పిల్లల క్యాన్సర్లు, పెద్ద వారికి వచ్చే క్యాన్సర్లతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటాయన్నారు.పిల్లల క్యాన్సర్‌కు శస్త్ర చికిత్స, కిమోథెరపి, రేడియేషన్, టార్గెటెడ్ థెరపి, ఇమ్యునో థెరపి, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్) ద్వారా చికిత్స అందిస్తామని తెలిపారు. మెరుగైన ఫలితాల కోసం చిన్న పిల్లల క్యాన్సర్ నిపుణుల పర్యవేక్షణలోనే చికిత్సలు జరగాలన్నారు. పిల్లల్లో తగ్గని నిరంతర జ్వరం, రక్తస్రావం, కీళ్ల నొప్పులు, రక్తహీనత, శరీరంలో కణితులు, గడ్డలు, ఎడతెగని వాంతులు, మెల్లకన్ను రావడం, తీవ్రమైన తలనొప్పి వంటివి కనిపిస్తే తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సెప్టెంబర్ నెలను పిడియాట్రిక్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా పాటిస్తారని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ అనీష్‌కుమార్ తివారీ, మేనేజర్లు బాలకృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

# ఇండ్లను తొలగిస్తే సహించం

**-కాలుష్య టింబర్ డిపోలను తొలగించాల్సిందే : నున్నా**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** శ్రీనివాస్ నగర్‌లో పేదల ఇండ్లను తొలగిస్తే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. 50 ఏళ్లుగా శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇండ్ల నిర్మించుకుని జీవిస్తున్న 500 కుటుంబాలకు తొలగించాలని నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎం అన్ని వేళల పేదలకు అండగా ఉంటుందని ఇప్పటికే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించామని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించామని ఆయన తెలిపారు. ఎవరైనా తొలగించేందుకు ప్రయత్నం చేస్తే సిపిఎం ఆందోళనను మరింత ఉధృతం చేస్తుందని ఆయన హెచ్చరించారు. కాయకష్టం చేసుకుని బతుకుతున్న పేదల పట్ల ప్రభుత్వం ఇటువంటి వైఖరి అవలంభించడం సరైంది కాదన్నారు. ఒక్క ఇంటిని కూల్చివేసినా ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. 58 జీవో క్రింద గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని ఇప్పుడు వాటిని ఎలా తొలగిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ నివసించే వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అదే సమయంలో టింబర్ డిపోలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నున్నా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రం, నాయకులు యర్రా శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, బండారు రమేష్, వజినేపల్లి శ్రీనివాసరావు, వెంకట్రావు, వీరబాబు, రంజిత్ పాల్గొన్నారు.

# ఫలించిన ఏఐటియుసి పోరాటం

**నాలుగు నెలల వేతనాలను విడుదల చేసిన ప్రభుత్వం**



**ప్రజాపక్షం/కల్లూరు:** తమ 9 నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని బుధవారం నుండి ఏఐటియుసి ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెను గురువారం తాత్కాలిక విరమణ చేశారు. మొత్తం తొమ్మిది నెలల వేతనాలకు కాను ఆరు నెలల వేతనాలను ఇవ్వడానికి కమిషనర్ చైర్మన్ ఒప్పుకొని తక్షణం నాలుగు నెలల వేతనాలను విడుదల చేయడంతో కార్మికులు సమ్మెను తాత్కాలిక విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ సీనియర్ నాయకులు సింగు నరసింహారావు మాట్లాడుతూ వేతనాల కొరకు సమ్మెలు చేయటం దురదృష్టకరమన్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో ఈ పరిస్థితి రానీయమని చైర్మన్ అప్పటి అధికారులు హామీ ఇచ్చారని కానీ మరలా సమస్య పునరావతం అవడంతో తప్పనిసరి పరిస్థితిలో సమ్మె చేయాల్సి వచ్చిందని అన్నారు. ఏఐటియుసి సమ్మెకు స్పందించిన అధికారులు, చైర్మన్ ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించడానికి సుముకత వ్యక్తం చేశారన్నారు. అందులో భాగంగానే నాలుగు నెలలు పెండింగ్ శాలరీను తక్షణమే విడుదల చేశారని ఆయన వెల్లడించారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు మాట్లాడుతూ పీఎఫ్ ఈఎస్ఐ విడుదల చేస్తామని గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చలేదని తక్షణమే కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. నిత్యవసర సరుకులను అందజేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాం డ్ చేశారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి జీతాల సమస్య కల్లూరు మున్సిపాలిటీలో పునరావతం అవుతుందని ఈసారి పునరావతం కాకుండా చూసే బాధ్యత చైర్మన్ అధికార యంత్రాంగం, పాలకవర్గంపై ఉందన్నారు . ఇదే సందర్భంలో కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు ఏఐటియుసి కట్టుబడి ఉందన్నారు. నాలుగు నెలల జీతాన్ని తక్షణమే అందించడంతోపాటు మరో రెండు నెలల జీతం అక్టోబర్ మొదటి తారీకు వరకు చెల్లించేలా చర్చలు సఫలమయ్యాయని ఆయన సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, బికేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసీ కల్లూరు అధ్యక్ష కార్యదర్శులు ఓడల కృష్ణ, సయ్యద్ వజీర్ మియా సహాయ కార్యదర్శులు చింతపల్లి శ్రీను, బాబు గౌడ్, చిన్న, రాంబాబు మణిరాజు ఉపాధ్యక్షురాలు యశోద, అంజలి, మరియమ్మ , కోశాధికారి కంభంపాటి ప్రకాష్ నాయకులు ఖమ్మం పాటి సుధాకర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బండారు నర్సింహారావు మాట్లాడుతూ డిప్యూటీ సిం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు పనులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. అనంతరం సైట్ ఇంజనీర్‌తో మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, ఎర్రుపాలెం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ కంచర్ల వెంకటనర్సయ్య, సెక్రటరీ సగుర్తి వెంకట నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జిలు యన్నం పిచ్చిరెడ్డి, శీలం వెంకటామిరెడ్డి, గుడేటి బాబురావు, నందిగనం సందీప్, బుచ్చిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ సంపసాల రామకృష్ణ, మధిర పట్టణ బిసిసెల్ అధ్యక్షులు ఉద్దండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక పరిపాలనే లక్ష్యం

**-అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజల సంక్షేమం, పారదర్శక పరిపాలనే ప్రజా పాలన యొక్క ప్రధాన లక్ష్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ పతాకావిష్కరణ చేశారు. అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో విజయం సాధించి ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికారన్నారు. ఈ చారిత్రక రోజును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడటమే ప్రజాపాలన ముఖ్య ఉద్దేశమన్నారు. బాధ్యత, పారదర్శకత, జవాబుదారీ తనం, సేవాభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారిణి జి. జ్యోతి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ జయంతి విశిష్టతను వక్తలు కొనియాడారు. అనంతరం విముక్తి జాతుల దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షులు అద్దంకి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెండేటి సోమేశ్వర చారి, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, బ్రహ్మశ్రీ రామడుగు నర్సింహాస్వామి, విజయగిరి సదానందచారి, ఇనుగుర్తి వెంకటేశ్వర్లు, పద్మాచారి, పమ్మి వెంకటేశ్వర్లు, పాపాచారి, ఉమామహేశ్వరరావు, పుల్లారావు, రాంబాబు, సోమరాజు, సదాశివరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, పాండురంగారావు, నాయకులు పాల్గొన్నారు.

# గణనాథునికి సరస్వతి పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో గల తారకరామ ఆటో నగర్‌లో ఫోర్ వీలర్స్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ మేథో దక్షిణామూర్తి లక్ష్మి గణపతి హోమం గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గణనాథునికి సరస్వతి పూజ విద్యార్థులతో నిర్వహించారు. వినాయక మండపం వద్ద గణపతి మాల వేసుకున్న స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నారు. శనివారం సిద్దిబుద్ది సమేత విఘ్నేశ్వర స్వామి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జునరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసగాని రవి, గుజ్జుల వెంకటరెడ్డి, దొంతరబోయిన భద్రం, కనకం రామకృష్ణ, కొనకటి షాయేందర్‌రెడ్డి, గంగవరపు శ్రీనివాసరావు, పగడం ప్రసాద్, గన్నా శ్రీనివాసరావు, రాకేష్, భాస్కర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



**ప్రజాపక్షం/కల్లూరు:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కల్లూరు లోని ప్రభుత్వ కార్యాలయాల లో అధికారులు, అనధికారులు ప్రజా ప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో అజయ్ యాదవ్, మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ మోహన్ నాయక్, గ్రామపంచాయతీ కార్యాలయాలలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

# ముదిగొండ అభివృద్ధికి భారీ ఊతం



## - విద్యార్థులతో ముచ్చటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి





**ప్రజాపక్షం/ముదిగొండ:** ముదిగొండ మండల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మండలంలో రూ.2.90కోట్లతో చేపట్టనున్న చిరుమర్రి చెరువు పర్యాటక అభివృద్ధి పనులతోపాటు రూ.40లక్షలతో నిర్మించనున్న గ్రంథాలయ భవనం, వనం వారి కృష్ణాపురంలో రూ.20లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి గురువారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. తెలంగాణ పబ్లిక్ పాఠశాలల నిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు, జోన్ ఇంఛార్జుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని పార్టీ బలోపేతం, సంక్షేమ పథకాల అమలుపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, పీసీసీ పరిశీలకుడు దుద్దిళ్ల శ్రీనివాస్‌బాబు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం



## -173 మందికి రూ 50.86లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం
## -పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాల పంపిణీ

**ప్రజాపక్షం/కూసుమంచి:** పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో గురువారం 173 మంది లబ్ధిదారులకు రూ 50.86 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మల్లేపల్లికి చెందిన 16 మందికి రెండు పడకగదుల ఇళ్లు, మునిగేపల్లికి చెందిన 12 మందికి ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటి వరకు సుమారు రూ 3,250కోట్ల మేర వైద్య సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో 4.5లక్షలు, రెండో విడతలో 2.5లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు రూ 1,100కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. పేదల కోసం గతంలో సేకరించి ఆక్రమణలకు గురైన నివాస స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, తహసీల్దార్ సైదులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు





**ప్రజాపక్షం/ ఖమ్మం టౌన్ :** ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్‌చౌదరి, శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీ నారాయణ, సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్‌ఖాదర్‌బాబా, జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలితం, ఎన్నో పోరాటాల స్ఫూర్తితో రాచరికపు పాలన నుంచి విముక్తి పొంది భారత యూనియన్‌లో విలీనమైన తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవం చారిత్రాత్మకమని అన్నారు. స్వేచ్ఛ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లమే మన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల గౌరవం, హక్కులు, సంక్షేమం కాపాడుతూ ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకత, సమానత్వంతో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. త్యాగధనుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి, సంక్షేమం ప్రతి గడపకు చేరేలా తెలంగాణను ప్రగతి పథంలో నడుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మల్లు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య అధ్యక్షతన తొలితరం తెలంగాణ ఉద్యమకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డే బోయిన నర్సింహారావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీనాయక్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు, నగర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి ఉప సర్పంచ్‌ల సమావేశం గురువారం తల్లాడ మండల కేంద్రంలో నిర్వహించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఉప సర్పంచ్‌లకు గ్రామ పంచాయతీలలో తగిన ప్రాధాన్యత, గౌరవం ఇవ్వాలని వారి హక్కులను కాపాడాలని తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ డిమాండ్ చేశారు. తల్లాడలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుభాషిణి అధ్యక్షతన జరిగిన సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి ఉప సర్పంచ్‌ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కొందరు సర్పంచ్‌లు ఉప సర్పంచ్‌లపై లేనిపోని ఆరోపణలు చేస్తూ చెక్ పవర్‌ని తొలగించాలని కలెక్టర్లు, మంత్రులు, ఎంఎల్‌ఏలకు వినతి పత్రాలు ఇవ్వడం అత్యంత బాధాకరమన్నారు. గ్రామ పంచాయతీలలో వేసే శిలఫలకాలపై ఉప సర్పంచ్‌ల పేర్లు ప్రచురించడం లేదని, సర్వసభ్య సమావేశాలకు సమాచారం ఇవ్వడం లేదని, నిర్ణయాలు, తీర్మానాలలో సంతకాలు తీసుకోకుండా కేవలం నోట్ ఫైళ్లపై సంతకాలు పెట్టమంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతనంగా రాష్ట్ర, నియోజక వర్గ, మండల స్థాయిల్లో ఎన్నిక కాబడిన ఉప సర్పంచ్‌లకు రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారిని సాదరంగా కమిటీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి వెంకటరెడ్డి, సత్తుపల్లి నియోజక వర్గం ఇంఛార్జి కర్నాటి లక్ష్మారెడ్డి, తల్లాడ మండల అధ్యక్షులు పెడిపల్లి జగన్, కల్లూరు మండల అధ్యక్షులు పైళ్ల రామకృష్ణ, నాయకులు వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, బాలశౌరి, చింటూ, బాబు, రాధాకృష్ణ, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజాపాలన దినోత్సవాన్ని రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణలో ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికిన చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తుంది. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎంపిడివో అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. గ్రామాల్లో సర్పంచులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపివో పద్మయ్య నాయుడు, ఈసి దీపక్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విశ్వకర్మ జయంతి వేడుకలను తల్లాడ మండల కేంద్రం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రుద్రాక్ష నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి తాటికొండ కృష్ణ ల నేతృత్వంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సృష్టికర్త ఆది దేవుడైన శ్రీ విశ్వకర్మ స్వామి చిత్ర పటాన్ని పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సంఘానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సమాజ ప్రగతికి, నిర్మాణ రంగానికి విశ్వ కర్మల నైపుణ్యం, శ్రమ ఎంతో కీలకమైందని వారు కొనియాడారు. సంఘ సభ్యులందరూ కలిసి కట్టుగా ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో గంటల వెంకటాచారి, శ్రీనివాసరావు, రవి, సత్యం, భాస్కరాచారి, సత్యనారాయణ, ప్రసాద్, నర్సింహాచారి, శ్యామ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే సహించేది లేదు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** గ్రామ సేవే దైవంగా గ్రామ ప్రగతే సంకల్పంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ జిల్లాస్థాయిలో గ్రామ కీర్తిని మరింతగా ఇనుమడింప చేస్తున్న గ్రామ సర్పంచ్ నిర్మలకుమారి ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవంను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ నిర్మలకుమారి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అట్టి వారిని సహించేది లేదని హెచ్చరించారు. బుధవారం కొందరు ఆకతాయిలు పైపులైన్లపై బండరాళ్లు వేసి కొత్త పైపులను పగలగొట్టారని, దయచేసి ఇలాంటి పనులు చేయవద్దని, ఇలాంటి వారి పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇలాంటి పనులు చేసే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తగిన బుద్ధి చెప్తామని సర్పంచ్ హెచ్చరించారు.

# నూరు శాతం ఫలితాలను సాధించాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలను నూరు శాతం సాధించాలని రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు సూచించారు. మండలం లోని రాయగూడెం లో గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రవేట్ కు దీటుగా ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొర్లకుంట్ల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ సూరేపల్లి ప్రేమకుమార్, ఇరగదిండ్ల నాగరాజు, కాకంగి వీరబాబు, మేకల మాధవి, తీగ హనుమంతరావు, లింగన్న, బోయిన కొండలు, దేగల వేణు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పశు సంపదతో ఆర్థిక స్వావలంబన సాధించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పశు సంపదతో రైతులు ఆర్థిక స్వావలంభన సాధించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని రాయగూడెం లో గోపాలమిత్ర ఆధ్వర్యంలో గురువారం పశు వైద్య శిబిరం ను నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందు ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...రైతులు పాడి పరిశ్రమ ను పెంపొందించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందాలని సూచించారు. మేలు జాతి పశువుల ద్వారా రైతులు ఆర్థికంగా నిలబడతారని అన్నారు. పశు వైద్యుల సలహాల మేరకు జీవాల పెంపకం పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు, సర్పంచ్ బోయిన వేణు, ఉప సర్పంచ్ సూరేపల్లి ప్రేమ్ కుమార్, ఇరగదిండ్ల నాగరాజు, కాకంగి వీరబాబు, మేకల మాధవి, తీగ హనుమంతరావు, లింగన్న, బోయిన కొండలు, దేగల వేణు తదితరులు పాల్గొన్నారు.